క్లుప్తంగా

యువత శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గడ్డి కాలనీ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో స్థానిక యువత శ్రమదానం చేసి, అక్కడి పరిసరాలను శనివారం శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు అక్కడ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అక్క డ పేరుకుపోయిన అపారిశుధ్యం కారణంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులు చూసి, యువత స్పందించినందుకు గాను వారి సేవలను అక్కడి వారంతా అభినందించారు.

విత్తన ఎంపికే ప్రధానం..



మాట్లాడుతున్న ఎ.డి. భారతి

పాలకొండ : రబీ సీజన్‌లో మినుము, పెసర సాగుకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవడమే ప్రధానమని డీఆర్‌సీ ఎ.డి భారతి తెలిపారు. మండలంలోని కొండాపురం గ్రామ రైతుసేవా కేంద్రంలో రబీ పంటల సాగుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తన శుద్ధితో పాటు సాగులో మెలకువలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దశలవారీ పోరాటం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతంపేట: సమస్యలపై దశలవారీ పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని రామానగరం, గోలుకుప్పగూడలలో శనివారం సీపీఎం మహాసభలు నిర్వహించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన తప్పదన్నారు. అలాగే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం మొదటి శనివారం కావడంతో పద్మావతి సమేత స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ఈ క్రమంలో భక్తులు స్వామిని దర్శించుకున్న తర్వాత పుట్టుదేవుని వద్దకు చేరకుని విశేష పూజలు నిర్వహించి, స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసినఅన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

రెండో రోజు పింఛన్ల పంపిణీ



లోవగూడలో చంద్రకళకు పింఛన్ అందిస్తున్న కార్యదర్శి అనసూయ

భామిని: మండలంలో శనివారం కూడా పింఛన్ల పంపిణీ కొనసాగింది. గురండికి చెందిన వృద్ధురాలు గౌడో చంద్రకళ తీవ్ర అస్వస్థతతో గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడలో వైద్య సేవలు పొందుతోంది. విషయం తెలుసుకున్న కార్యదర్శి అనసూయ లక్కగూడ వెళ్లి పింఛన్ అందజేసింది. మిగతా గ్రామాల్లోనూ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

బెల్ట్‌షాపులపై సమాచారం ఇవ్వండి

సీతానగరం: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలపై సచివాలయ మహిళా పోలీసులు నిఘా పెట్టాలని, బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే సమాచారం అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి అన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం మండల పరిధిలో ఉన్న సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహించిన, సారా అమ్మకాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య భవితకు 'ప్రశస్థ'



- ఉపాధ్యాయులే పరిశీలకులు
- ఆరోగ్య వివరాలన్నీ యాప్‌లో నమోదు
- గుర్తించిన విద్యార్థులకు నగదు సాయం..



ప్రశస్థ యాప్‌ను రిజిస్టర్ చేసి చూపుతున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్:

విద్యార్థుల్లో పలువురికి శారీరక, మానసిక సమస్యలుంటాయి. మరికొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల చదువుతున్న ఇటువంటి విద్యార్థులను గుర్తించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) 'ప్రశస్థ' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారిలోని లోపాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబర్, యూడైస్ కోడ్‌తో ప్రశస్థ యాప్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంది. అనంతరం యాప్ సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

21 రకాల లోపాలను గుర్తించేలా...

వైకల్యం ఉన్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చడం, పిల్లల పరిస్థితి గుర్తించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అలాగే విద్యార్థుల సామర్థ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. చెప్పిన పదాన్ని పదే పదే చెప్పడం.. రోజువారీ పనులు చేసుకోలేక పోవడం.. అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం.. నెమ్మదిగా చదవడం, రాయడం.. స్పష్టత లేని చేతిరాత.. రివర్స్ రాయడం.. గణిత చిహ్నాలు అర్థం చేసుకోలేకపోవడం.. పునరావృత ప్రదర్శనలో ఇబ్బంది పడడం.. విచారంగా కనిపించడం.. ఇతర విద్యార్థులతో పోలిస్తే సులభంగా అలసిపోవడం.. తదితర 21 రకాల లోపాలను ఉపాధ్యాయులు గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు.

రెండు విభాగాలుగా....

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్థ యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్నింటిని వారే విద్యార్థిని పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాల్సి ఉంటుంది. లోపాలున్న విద్యార్థులను గుర్తించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

నగదు రూపంలో అలవెన్స్‌లు..



యాప్ ద్వారా విద్యార్థుల ఆరోగ్య భవితకు భరోసా లభిస్తుంది. వీరిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం తరఫున వైద్య సేవలతో పాటు నగదు రూపంలో అలవెన్సులు అందిస్తాం. 1– 8 తరగతుల మధ్య గల 151 మంది విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్సు రూ.3 వందల చొప్పున 10 నెలలకు గాను 4,53,000 రూపాయలు.. 9 నుంచి ఇంటర్ చదువుతున్న 104 మందికి నెలకు రూ.3 వందలు చొప్పున 10 నెలలకు 3,12000 రూపాయలు మంజూరయ్యాయి. రెండో విభాగానికి సంబంధించి ట్రాన్స్‌పోర్టు అలవెన్స్‌ల రూపంలో 1 నుంచి 8వ తరగతి చదువుతున్న 182 మంది విద్యార్థులకు రూ. 5,46,000.. 9 నుంచి ఇంటర్ చదువుతున్న 139 మంది విద్యార్థులకు రూ.4,17,000 మంజూరయ్యాయి. అలాగే 1– 8 తరగతులు చదువుతున్న 483 బాలికలకు రూ.9,66,000.. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న 214 మంది బాలికలకు రూ.4,28,000 మంజూరయ్యాయి. ఈ మొత్తాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఖాతాలకు త్వరలోనే జమ చేస్తాం.

– నల్ల తిరుపతినాయుడు, విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

15 మండలాల్లో..

జిల్లాలోని 15 మండలాల్లో ఎన్‌సీఈఆర్టీ అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రశస్థ యాప్‌లో ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా పార్ట్ –1కు 365 మంది ఉపాధ్యాయులు రిజిస్టర్ అయ్యారు. వీరిలో 184 మంది మాత్రమే గుర్తింపు పొందారు. పార్ట్–2కు సంబంధించి 256 మంది రిజిస్టర్ చేసుకోగా 144 మంది గుర్తింపు పొందారు. గుర్తింపు పొందిన వారిలో 26 మంది హెచ్‌ఎంలు, 9 మంది ప్రత్యేక ఉపాధ్యాయులున్నారు. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న పార్ట్ –1 సర్వేలో 519 మంది.. పార్ట్–2 సర్వేలో 467 మందిని గుర్తించారు. ఈ విధానంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్క్రీనింగ్ పూర్తి చేయడం ద్వారా సమస్యలు గుర్తించి విద్యార్థులకు అవసరమగు తోడ్పాటు అందిస్తారు.

ఉద్యోగుల భద్రతే లక్ష్యం

- ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల భద్రతే లక్ష్యంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) అడుగులు వేస్తోందని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పాలకొండలో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కొంతమంది అధికారుల అలసత్వం కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కొత్త బస్సుల ఆవశ్యకత, అలవెన్సులు, దీర్ఘకాల సమస్యలను అధి గమించేందుకు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 7వ తేదీన విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈయన వెంట రాష్ట్ర కోశాధికారి సీవీవీ మోహన్, కార్యదర్శి ఆర్.నరసింహులు, జోనల్ కార్యదర్శి సూర్యారాములు, నాగరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎన్‌ఎంయూ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వీడీవీకేల ఏర్పాటుకు స్థలాలు గుర్తించండి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



పార్వతీపురంటౌన్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో చేతివృత్తుల కళాకారుల బజార్లు, గోకులాలు, వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశోతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో చేతివృత్తుల బజార్లు, వీడీవీకేలు, మల్టీపర్పస్ సెంటర్లు, గోకులాలపై సంబంధిత అధికారులతో పీఓ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక బజార్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధికల్పనతో పాటు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోకులాలను ఏర్పాటు చేసి వాటితో ఆర్థిక ప్రయోజనం పొందే దిశగా ప్రోత్సహించనున్నట్లు ఆయన వివరించారు. వీటి ఏర్పాటు కోసం అవసరమైన స్థలాలను గుర్తించాలని, ఏర్పాటు చేశాక అవి వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పీఓ కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఏపీడీ వెలుగు, ఏపీఎంలు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలేవీ..?



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ రూరల్: ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీపీఎం మండల కన్వీనర్ దావాల రమణారావు ప్రశ్నించారు. మండలంలోని నాగావళి నదీ తీరం వెంబడి గల గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెనలు, తాగునీటి వనరులకు దాదాపు ఐదు వందల మీటర్ల దూరంలో తవ్వకాలు చేపట్టకూడదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, అక్రమార్కులు లెక్క చేయడం లేదన్నారు. మంగళాపురం సమీపంలో వంతెన దిగువ వందల ట్రాక్టర్లతో ఇసుక తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈయన వెంట ఆ సంఘ నాయకులు మజ్జి వీరన్నాయుడు, కాద రాము, చంద్రశేఖర్, గోగుల నరేష్, తదితరులున్నారు.

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

సీతానగరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు కృషిచేయాలని మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ ఏఈ జానకీరాం అధ్యక్షతన శనివారం గృహ నిర్మాణాలపై తహసీల్దార్ ఉమామహేశ్వరరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులు ఆరాతీశారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుదీకరణ, తదితర మౌలిక వసతులు కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలసాగులో సస్యరక్షణ తప్పనిసరి

- ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి



పాలకొండ మండలం తుమరాడలో సీజనల్ చామంతి

పాలకొండ రూరల్: ప్రస్తుత వాతావరణం పూల సాగుకు అనుకూలంగా ఉంటుంది. అయితే పూల మొక్కలకు వివిధ రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, సస్యరక్షణతో వాటికి చెక్ చెప్పి అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి తెలిపారు. ఈ సీజన్‌లో అన్ని రకాల పూల మొక్కలు పూతకు వస్తాయన్నారు. అయితే సరైన సమయంలో వాటికి ఆశించే చీడపీడలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా చామంతిలో అధిక దిగుబడులు వస్తాయి. ఈ నేపథ్యంలో చామంతి సాగుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు.

వేరు తెగులు..

ప్రస్తుత సీజన్‌లో చామంతి తోటలకు వేరు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. దీని వల్ల మొక్కలు సత్తువ కోల్పోయి వాలిపోవడం జరుగుతుంది. ఆకులు ఎండి వేళ్ల మొదటి నుంచి కుళ్లు ప్రారంభమవుతుంది. దీని నివారణకు తోటల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు తోటలో 100 కిలోల వరకు పశువుల ఎరువులు, రెండు కిలోల ట్రైకోడెర్మాన్ వేయాలి. బ్లయిటాక్స్ మూడు గ్రాములు లేదా కాప్టన్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు కూడా ఇదే సీజన్‌లో వస్తుంది. ఈ తెగులు ఆశిస్తే మొక్కలపై నల్లటి, లోతైన మచ్చలేర్పడి ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

తామర, పచ్చపురుగు నివారణకు...

శీతాకాలం మంచు కారణంగా పచ్చపురుగు(గొంగళి) చామంతికి ఆశిస్తుంది. ఈ పురుగు ఆకులు, పువ్వులను తిని నష్టపరుస్తుంది. దీని నివారణకు మిథైల్ పెరాథియాన్ ఒక మిల్లీలీటర్ లేదా కార్బియల్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క ఆకు, పువ్వు తడిచేలా పిచికారీ చేసుకోవాలి. తామర పురుగులు గుంపులు గుంపులుగా చేరి మొక్కలోని పత్రహరితాన్ని (పచ్చదనాన్ని) పీల్చి తోటల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయి. దీని కారణంగా ఆకులు ముడతలు పడి రాలిపోతాయి. పూలు రంగుమారి వాడిపోతాయి. ఈ తెగులు నివారణకు డైమిథోయేట్ రెండు ఎం.ఎల్ లేదా ఫిప్రోనిల్ 2 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి తెలిపారు.

మరకత లింగేశ్వరుడికి దీపాలంకరణ..



పవిత్ర కార్తీకమాసం ప్రారంభం కావడంతో శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పట్టణ పరిధిలోని సనారీ విశ్వేశ్వర, భీమలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర ఆలయాలతో పాటు ఉమారామలింగేశ్వర, సదాశివ ఆలయాల్లో శనివారం విశేష పూజలు చేపట్టారు. నక్కలపేటలో వెలిసిన మృత్యుంజయ మరకత లింగేశ్వర ఆలయంలో దీపాలంకరణతో పాటు సహస్ర దివ్యహారతి కార్యక్రమం అర్చకుడు శరత్‌బాబు ఆధ్వర్యంలో చేపటట్టారు. కార్తీకమాస విశిష్టతను కాశీ విశ్వేశ్వర ఆలయంలో జోష్యుల ఆంజనేయ శర్మ, భీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో గానీ బాబు భక్తులకు వివరించారు.

– పాలకొండ రూరల్

ఘనంగా సమాధుల పండగ

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న క్రైస్తవులంతా సమాధుల పండగను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి, కొవ్వొత్తులు వెలిగించి, పువ్వులు చల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ఏసుప్రభువును ఆరాధించారు. ప్రతిఒక్కరూ బతికినంత కాలం మంచిగా బతకాలని, పొరుగువారికి ఎట్టి పరిస్థితుల్లోనూ కీడు తలపెట్టకూడదని అప్పుడే పరలోకంలో ప్రభువు వద్ద మనకు స్థానం లభిస్తుందని ఫాదర్లు తెలిపారు.

–గుమ్మలక్ష్మీపురం



ఉత్తమ ఫలితాలు సాధించాలి..



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ ఈఓ పి.నారాయుడు ఆకాంక్షించారు. మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. గణితం, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

– సీతంపేట

రేకుల షెడ్డులో తరగతులు..



విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న పాలకుల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. పీవీ ఈతమానుగూడ పంచాయతీ చావిడివలస ప్రాథమిక పాఠశాలలో 72 మంది విద్యార్థులు చదువుతున్నా, ఎటువంటి మౌలిక వసతులు కల్పించలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంతమందికీ ఒకే గది ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట ఉన్న రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవనం నిర్మించాలని గిరిజన సంఘ అధ్యక్షుడు ఎం. లక్ష్మణరావు, తదితరులు కోరుతున్నారు.

– సీతంపేట

డ్యామేజీ పేరుతో డబ్బులు వసూలు..



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటి నుంచి కొంతమంది అధికారులు డ్యామేజీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శంకరరావు, బి. కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక డిపో ఎదుట వీరు విలేకరులతో మాట్లాడుతూ, విధి నిర్వహణలో డ్యామేజీలకు ఉద్యోగులను బాధ్యులను చేయడం సరికాదని తెలిపారు. ఇంతవరకు ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

– పాలకొండ

అపరిచితులకు బ్యాంకు వివరాలు చెప్పొద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పవద్దని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. మండలంలోని గుజ్జుపాడు గ్రామంలోని గ్రామస్తులకు సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్లు, లక్కీ డ్రా పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడతారని, వారి వలలో పడవద్దన్నారు. అలాగే యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. యువతీ, యువకులు కూడా మత్తు పదార్థాలు, లేనిపోని ఎంజాయ్‌మెంట్‌లకు అలవాటు పడొద్దని, ఉన్నతమైన ఆలోచన విధానంతో మంచిగా జీవించాలని తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలను దేవాదాయశాఖ సిబ్బంది శనివారం లెక్కించారు. చదురు గుడి హుండీ ద్వారా రూ.1,10,028 లు, వనం గుడి హుండీ ద్వారా రూ.97,888 లు ఆదాయం సమకూరింది. ఆలయ కార్య నిర్వహణ అధికారి వీవీ సూర్యనారాయణ, , తదితరులు సేవలకు పాల్గొన్నారు.